ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 19, ఫిబ్రవరి 2026

## జాతీయ రహదారిపై పత్తి రైతుల ఆందోళన

● వాహనాలు నిలిచి స్తంభించిన ట్రాఫిక్ ● పోలీసుల జోక్యంతో రైతులు ఆందోళన విరమణ



**తాండూర్, ప్రభాతవార్త**

మండలంలోని రేపల్లె వాడ వద్ద గల జిన్నింగ్ మిల్లు ముందు జాతీయ రహదారిపై బుధవారం పత్తి రైతులు ఆందోళన నిర్వహించారు. రహదారిపై వాహనాలు నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూఈనెల 20 తేదీ వరకే సీసీఐ కేంద్రాలలో రైతులు పత్తిని మిగతా 2లో..

## రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం

✶ అతివేగమే ప్రమాదానికి కారణం..

✶ బోల్తా పడిన బోర్ వెల్ లారీ..

✶ ఇందారం క్రాస్ రోడ్ నుంచి వేలాల పొనూర్ వరకు వేగ నియంత్రణల ఏర్పాటుతో ప్రమాదాలను నివారణ



నారాయణ, భారతమ్మ (ఫైల్)



– జైపూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త

2లో..

## ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయం

★ జిల్లా కలెక్టర్ కె.హరిత

**కెరమెరి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

జిల్లాలో ప్రజా సంక్షేమంలో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కెరమెరి మండల కేంద్రంలో గల స్టార్ ఫంక్షన్ హాల్ లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో ప్రతిమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కరీంనగర్ వారు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ





లక్ష్మి మ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో మిగతా 2లో..

## ప్రజల కోసం ప్రతిపక్షంగా పోరాటం కొనసాగిస్తాం

✻ బీఆర్ఎస్‌ను అడ్డుకునేందుకు బెదిరింపులు, అక్రమ కేసులు, డబ్బు ప్రలోభాలతో కుట్రలు కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు

✻ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

ప్రజలు ఇచ్చిన మద్దతును గౌరవిస్తూ ప్రతిపక్షంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్పష్టం చేశారు. బెల్లంపల్లిలో బీఆర్ఎస్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే బాధ్యత తమపై ఉందన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో మొత్తం 22 వార్డుల్లో 14 స్థానాలు గెలిచిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)ను అధికారంలోకి రానీయకుండా భారత జాతీయ కాంగ్రెస్ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గుండాయిజం, బెదిరింపులతో ఎన్నికల ప్రక్రియను అడ్డుకుని ప్రజల తీర్పును అవమానించారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని, అధికార బలంతో ప్రతిపక్షాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నదని, స్వతంత్ర సభ్యులను బెదిరించి, డబ్బు, మద్యం ఆశ చూపి తమ వైపు తిప్పుకున్నారని విమర్శించారు. స్థానిక మిగతా 2లో..



## బీజేపీ మత రాజకీయాలు చేస్తోంది

➡ కోనేరు కోనప్ప సంచలన వ్యాఖ్యలు ➡ ప్రజల తీర్పే బీజేపీకి చెంపపెట్టు

➡ రహస్య ఒప్పందాలు బయటపడ్డాయ్ ➡ బీజేపీ ప్రచారానికి ఫలితం శూన్యం

➡ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ పట్టణంలోని తన నివాసంలో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశంలో హిందూ–ముస్లిం అనే పేరుతో మత రాజకీయాలు చేసి ప్రజలను విభజించే పని బీజేపీ చేస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్న తమ పార్టీకి ఈ మున్సిపల్ ఎన్నికల్లో 11 సీట్లు వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, సిట్టింగ్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ముఖ్యమంత్రి, ఇద్దరు ఎంపీలు, ఒక స్వామీజీ వరకు ప్రచారానికి వచ్చినప్పటికీ బీజేపీకి కేవలం 5 సీట్లు మాత్రమే రావడం ప్రజల తీర్పుకే నిదర్శనమన్నారు. గతంలో తన హయాంలో కబ్జాలు మిగతా 2లో..

## జాతీయ రహదారిపై పత్తి రైతుల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

విక్రయించాలని అధికారులు ప్రకటించారని అన్నారు. దీంతో వివిధ గ్రామాలకు చెందిన రైతులు వాహనాల ద్వారా పత్తిని విక్రయించేందుకు మిల్లులకు వద్దకు వస్తే పత్తి పురుగు, పుచ్చు ఉందని, నాణ్యతగా లేదని సిసిఐ అధికారులు కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. పత్తి కొనుగోలు గడువును పెంచాలని, రైతులు తీసుకు వస్తున్న పత్తికి ఎలాంటి షరతులు లేకుండా సీసీఐ ఆధ్వర్యంలో అధికారులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఈ సందర్భంగా సీసీఐ కేంద్రం ఇంచార్జ్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తీసుకువచ్చిన పత్తిలో చాలా వరకు పురుగు పట్టి ఉంటుందని, నాణ్యమైన పత్తి రావడంలేదని, సిసిఐ నిబంధనల మేరకే పత్తి కొనుగోలు చేస్తున్నమన్నారు. జాతీయ రహదారిపై రైతులు ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న తాండూర్ ఏఎస్ఐ రాజమోళి సంఘటన స్థలానికి చేరుకొని రైతులు, సీసీఐ అధికారులతో మాట్లాడి ఆందోళనను విరమింప చేశారు. రహదారిపై స్తంభించిన ట్రాఫిక్ ను పోలీసులు పునరుద్ధరించారు.

## ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయం

(మొదటిపేజీ తరువాయి)

పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలను చేసుకోవాలని, అవసరమైన వారికి ప్రతిమ మెడికల్ సైన్సెస్ వారు కరీంనగర్‌లో శాస్త్ర చికిత్సలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో దాదాపు 2 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించడం జరిగిందని తెలిపారు. ఆసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రతిమ ఫౌండేషన్ వారు కెరమెరి మండలంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందని, ఈ శిబిరం నిర్వహణలో కెరమెరి మండల సమాఖ్య ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, తాసిల్దార్ సంతోష్ ఎంపీడీవో సురేష్ స్థానిక ఉప సర్పంచ్ లు, ప్రతిమ ఫౌండేషన్ సభ్యులు, వైద్యులు, మండల సమాఖ్య సభ్యులు, సెర్ప్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## క్రీడా ప్రోత్సాహానికి ఫిఫా ఫుట్‌బాల్ బంతుల పంపిణీ

### - జవహర్ నవోదయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :**

క్రీడా ప్రోత్సాహానికి ఫిఫా ఫుట్‌బాల్ బంతుల పంపిణీ చేసినట్లు కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ అన్నారు. బుధవారం పి ఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయం కాగజ్‌నగర్‌లో ఫుట్‌బాల్‌కు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఫుట్‌బాల్ ఫర్ స్కూల్స్ కార్యక్రమం భాగంగా జిల్లాలోని 53 విద్యాలయాలకు వారి విద్యార్థుల సంఖ్యను ఆధారంగా వివిధ విద్యాలయాలకు 400 ఫిఫా ఫుట్‌బాల్ బంతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అసిస్టెంట్ ట్రెజరరీ ఆఫీసర్ అధికారి (జిల్లా ఉప కోశాధికారి) పంకజ్ పాల్ విచ్చేశారు. ప్రత్యేక అతిథిగా ఏకలవ్య మోడల్ పాఠశాల ప్రధానాచార్యులు రమేష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు వివిధ విద్యాలయాల నుండి వచ్చిన అధ్యాపకులను విద్యాలయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ ఘనంగా స్వాగతించారు. ఈ విద్యాలయంలోనే 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకొని ఈ విద్యాలయానికి అతిథిగా విచ్చేయడం ఈ విద్యాలయానికి ఎంతో ఆదర్శమని తెలుపుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రమేష్ రావు ఆరోగ్యవంతమైన జీవితం కోసం ఆటలు అత్యంత ముఖ్యమని, గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని ఆటలు నేర్పుతాయని, క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ముఖ్య అతిథి పంకజ్ పాల్ గారు మాట్లాడుతూ క్రీడారంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించిన వారికి ప్రభుత్వం ఉన్నతస్థాయి ఉద్యోగాలు కల్పిస్తోందని, చదువుతో పాటు ఆటల్లో ప్రతిభ చూపిన వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభించడమే కాక ఉన్నత ఉద్యోగావకాశాలు కూడా దక్కుతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఆటల పట్ల మంచి స్ఫూర్తి కలిగి ఉండాలని, క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ తరపున రవికుమార్, రాజశేఖర్, వనిత తదితరులు పాల్గొన్నారు.



ఫిఫా ఫుట్‌బాల్ బంతులు పంపిణీ చేస్తున్న దృశ్యం

# బీజేపీ మత రాజకీయాలు చేస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

జరిగాయని ఆరోపిస్తున్న నాయకులే, అప్పట్లో తన వద్ద ఉన్న వారికే ఇప్పుడు మద్దతు ఇస్తున్నారని కోనేరు కోనప్ప విమర్శించారు. మహిళలు, పిల్లలను బెదిరించామంటూ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, అలాంటి వ్యాఖ్యలు చేయడానికే కొంచెం సిగ్గు ఉండాలన్నారు. చైర్‌పర్సన్ అభ్యర్థికి మద్దతు ఇచ్చిన బీజేపీ కౌన్సిలర్‌కు వ్యతిరేకంగా వైస్ చైర్‌పర్సన్ పోటీలో తమ కౌన్సిలర్లు నైతిక విలువలకు కట్టుబడి నిర్ణయం తీసుకున్నారని వివరించారు. రాదా మనోహర్ దాస్ వంటి వారిని తీసుకువచ్చి పట్టణంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం బీజేపీ నాయకులదేనని ఆరోపించారు. గత పదేళ్ల పాలనలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యలు పరిష్కరించలేక ట్యాంకర్ల ద్వారా నీళ్లు అందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేసి ఇప్పుడు మత రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ-కాంగ్రెస్ రహస్య మైత్రి బయటపడిందని, రెండు పార్టీలు లోపల కలిసి బయట ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ఒకే వేదికపై నిలబడి ప్రచారం చేసుకుంటే నిజస్వరూపం ప్రజలకు మరింత స్పష్టమవుతుందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన తీర్పు ఇస్తారని కోనేరు కోనప్ప పేర్కొన్నారు.

## ప్రజల కోసం ప్రతిపక్షంగా పోరాటం కొనసాగిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే గడ్డం వినోద్ అధికారాన్ని ఉపయోగించి ఒత్తిడులు తెచ్చారని ఆరోపించారు. అప్రజాస్వామికంగా పురపాలక పగ్గాలను చేజిక్కించుకున్నారని, అధికార అహంకారంతో వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజల గొంతుకగా నిలిచి అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, బీఆర్ఎస్ నూతన కౌన్సిలర్లు 1వ వార్డు కొయ్యడ ప్రసన్న, 3వ వార్డు లక్కాకుల సౌజన్య, 4వ వార్డు ఈట కమల, 5వ వార్డు గోగర్ల స్వప్న, 6వ వార్డు సల్ల కృష్ణవేణి, 9వ వార్డు కాంపెల్లి రాజం, 12వ వార్డు తిరుమల వాసు ధరావత్, 13వ వార్డు దొంగల రాజకుమార్, 14వ వార్డు ఆశాది మధు, 18వ వార్డు బత్తుల అనిత, 19వ వార్డు ఎస్.కె. సిమ్రాన్, 20వ వార్డు తాండ్ర స్రవంతి, 21వ వార్డు రాజనాల రమేష్, 31వ వార్డు బండారి స్రవంతి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సమిష్టి కృషితోనే సింగరేణి పురోగతి.. లక్ష్యాల సాధనలో రాజీ పడొద్దు

### - ఉత్పత్తి, మార్కెటింగ్ అంశాలపై శ్రీరాంపూర్ ఏరియా అధికారులతో జీఎంల సమీక్ష

**నస్పూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థ అభివృద్ధి అధికారులు, కార్మికుల సమిష్టి కృషిపైనే ఆధారపడి ఉంటుందని ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్, మార్కెటింగ్ జీఎం టి. శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో బుధవారం ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, మార్కెటింగ్ జీఎం టి. శ్రీనివాస్ సంయుక్తంగా ఏరియా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, నాణ్యతతో పాటు వినియోగదారులకు బొగ్గు సరఫరా వ్యవస్థపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. వార్షిక లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ గనుల్లో యంత్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. షిఫ్టుల వారీగా ఉత్పత్తిని పెంచాలి. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రమాద రహిత ఉత్పత్తికి అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. మార్కెటింగ్ జీఎం టి. శ్రీనివాస్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రవాణాలో జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలి. మార్కెట్ పోటీని తట్టుకునేలా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. నిల్వ సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలి. మెరుగైన ఫలితాలు సాధించిన విభాగాలను అభినందిస్తూ మిగిలిన వారు కూడా అదే స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షలో ఏరియా ఇంజినీర్ టి. రమణ రావు, ప్రాజెక్ట్ అధికారులు ఏ. వెంకటేశ్వర రెడ్డి, చిప్ప వెంకటేశ్వర్లు, ఏజెంట్లు శ్రీధర్, జి. రవికుమార్ హాజరయ్యారు. డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, ఆనంద్ కుమార్, విజయ్ కుమార్, రవీందర్, మల్లయ్య, డీవై సీఎంఓ డాక్టర్ పి. రమేష్ బాబు, ఏరియా సర్వే అధికారి నర్సింగరావు, క్వాలిటీ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, సెక్యూరిటీ అధికారి జక్కా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం

**జైపూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

జైపూర్ మండలం, ఇందారం గ్రామం లో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకోగా, దంపతులు మృత్యు వాత పడ్డారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. నస్పూర్‌లోని సంఘంమల్లయ్య పల్లి గ్రామానికి చెందిన బేతోజు నారాయణ (73), బేతోజు భారతమ్మ (65) దంపతులు వేలాల మల్లన్న దర్శనానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందారం ఖాసీం పల్లె ప్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఈ ఘటన జరిగింది. అతివేగంగా దూసుకొచ్చిన బోర్‌వెల్స్ లారీ ద్విచక్ర వాహనాన్ని వెనక నుండి బలంగా ఢీకొట్టడంతో నారాయణ, బారతమ్మ దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బోర్‌వెల్స్ లారీ బోల్తా పడింది. నారాయణ కుమారుడు శివకృష్ణ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

### అతి వేగమే ప్రమాదానికి కారణం...

బోర్‌వెల్ లారీని డ్రైవర్ అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడపడడం వల్లనే ఈ ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి, దంపతుల పై నుండి వెళ్లడంతో మృత దేహాలు నుజ్జు నుజ్జు అయిన తీరును చూస్తే అర్థం అవుతుంది. ప్రమాదంలో బైక్ ను ఢీ కొట్టి బోల్తా పడిందంటే మితి మీరిన వేగమే ప్రధాన కారణమని అవగతమవుతుంది.

### ఇందారం క్రాస్ రోడ్ నుంచి వేలాల పొనూర్ వరకు వేగ నియంత్రల ఏర్పాటుతో ప్రమాదాల నివారణ

గోదావరిఖని మార్గంలో ఇందారం క్రాస్ రోడ్ నుండి ఇందారం, టేకుమట్ల, చెట్ పల్లి, నర్సింగాపూర్ కుందారం, కిష్టాపూర్, వేలాల, పొనూర్ గ్రామాల వరకు ఈ రహదారి విస్తరించి ఉంది. సుమారు 10 కిలో మీటర్ల వరకు ఉన్న ఈ రోడ్‌లో పది, పదహేను మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మూల మలుపులు వద్ద ప్రమాదాలు జరగగా, పలువురు వాహనాధారులు తీవ్ర గాయాల పాలయ్యారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు గాని పోలీసులు గాని స్పందించి ప్రమాదకర ప్రదేశాలలో, మూల మలుపుల వద్ద వేగ నియంత్రికలు(స్పీడ్ బ్రేకర్లు) ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

## డిజిటల్ లావాదేవీలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి

### - టీజీబీ సీతారాంపల్లి శాఖ నిర్వహణ అధికారి నరసింహస్వామి

**నస్పూర్, ప్రభాతవార్త**



డిజిటల్ లావాదేవీల నిర్వహణలో మోసాల బారిన పడకుండా ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాంపల్లి శాఖ నిర్వహణ అధికారి నరసింహ స్వామి అన్నారు. సుందరయ్య కాలనీలో బుధవారం బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. పది నుంచి 18 ఏళ్ల వయసు గల పిల్లలందరికీ బ్యాంకు ఖాతాలు అందజేస్తామని నరసింహ స్వామి వెల్లడించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి బ్యాంకులో ఖాతా కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఏటా 20 రూపాయల ప్రీమియంతో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా లభిస్తుందని, 436 రూపాయలు చెల్లించడం ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద రెండు లక్షల రూపాయల బీమా ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 ఏళ్ల తర్వాత నెలకు వెయ్యి నుంచి ఐదు వేల రూపాయల వరకు పెన్షన్ అందుతుందని, ఏటీఎం కార్డు వినియోగించే వారికి ప్రమాదవశాత్తు మరణిస్తే రెండు లక్షల రూపాయల బీమా సౌకర్యం ఉంటుందని వివరించారు. ఖాతాదారులు తమ పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పకూడదని, అపరిచిత ఫోన్ కాల్స్ నమ్మవద్దని నరసింహ స్వామి హెచ్చరించారు. రమేష్ కల్చరల్ అసోసియేషన్ బృందం మ్యాజిక్ షో, పాటల ద్వారా బ్యాంకింగ్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించింది. కార్యక్రమంలో ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ రమేష్ రావు, విడ్స్ సంస్థ ప్రతినిధులు రాజేష్, స్వరూప, నాగలక్ష్మి, రామ, లావణ్య, రేణుక, సులోచన, తిరుమల, కవిత, అనసూయ పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగుల పెన్షన్ క్లెయిమ్స్ త్వరితగతిన పరిష్కరించాలి

## శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ - శ్రీరాంపూర్‌లో 6వ ప్రయాస్ సమన్వయ కమిటీ సమావేశం

**నస్పూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన సీఎంపీఎఫ్ నంబర్ కేటాయింపు, పదవీ విరమణ పొందిన వారి క్లెయిమ్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం సామాజిక భద్రత కల్పించేందుకు సీఎంపీఎఫ్ ఆధ్వర్యంలో 6వ ప్రయాస్, కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. భవిష్య నిధి, పెన్షన్ దావాలను తక్షణమే పరిష్కరించి జీరో పెండెన్సీ సాధించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 90 రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీలను లబ్ధిదారులకు అందజేశారు. సీఎంపీఎఫ్ పెన్షన్ లావాదేవీలు ప్రస్తుతం సీకేర్స్ పోర్టల్ ద్వారా జరుగుతున్నాయని మునిగంటి శ్రీనివాస్ గుర్తు చేశారు. సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్-1 హరి పచౌరీ మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు ఎలాంటి జాప్యం లేకుండా నిధులు చెల్లించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు పెండింగ్ పెన్షన్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్య దళారుల ప్రమేయం లేకుండా సీఎం పీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని సూచించారు. సీకేర్స్ పోర్టల్ ద్వారా సమస్యలను పరిష్కరించుకునే



విధానాలను అధికారులు ఉద్యోగులకు వివరించారు. ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న మహిళా కార్మికులకు వారి మొబైల్ ఫోన్లలోనే సీఎంపీఎఫ్ వివరాలను చూపే విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్-2 కె. గోవర్ధన్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, సీనియర్ పీఓ సురేందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, పిట్ కార్యదర్శి సందీప్, సీఎంపీఎఫ్ కార్యాలయ సిబ్బంది, గనుల సంక్షేమ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సేవాలాల్ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలి

### - ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీల మైదానంలో బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 287వ జన్మదిన వేడుకలు ప్రభుత్వం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ అధికారిక ఉత్సవాలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, మాజీ మంత్రి జోగు రామన్న, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఎ పీవో యువరాజ్ మర్మాట్, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ ఎస్పీ మోనికలతో కలిసి బంజారా సంప్రదాయం ప్రకారం స్వామివారికి భోగ్ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంజారా సమాజాన్ని చైతన్య పరిచిన మహనీయుడు సేవాలాల్ అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ సమాజం కోసం సమయాన్ని కేటాయించాలని పిలుపునిచ్చారు. బంజారాల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో వాటిని ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన బంజారా సోదరీమణులు తమ సంప్రదాయ నృత్యాలతో అలరించారు.



## బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్షలు తప్పవు

### - సిరికొండ అధికారుల హెచ్చరిక

**సిరికొండ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

మండలంలోని పొన్న గ్రామంలో బాల్య వివాహాల నిరోధంపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు, బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటీవల గ్రామంలోని మూడు కుటుంబాలలో మైనర్ బాలికలకు వివాహాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారంతో అధికారులు రంగంలోకి దిగి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసిల్దార్ తుకారాం, ఎస్సై పూజ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, దీనిని ఉల్లంఘించిన వారికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ఆడపిల్లలను భారంలా భావించకుండా కనీసం డిగ్రీ వరకు చదివించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుమలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంతోష్, ఉప సర్పంచ్, జిపిఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి?

### - సిజిఆర్ఎఫ్ చైర్మన్ ఎరుకల నారాయణ

**సారంగాపూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల ఫోరం గ్రీవెన్స్ కార్యక్రమంలో చైర్మన్ ఎరుకల నారాయణ పాల్గొని వినియోగదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లూజ్ లైన్లు, లోవోల్టేజ్, అధిక బిల్లుల వంటి సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎండాకాలంలో లూజ్ లైన్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, రైతులు ఫిర్యాదు చేయగానే అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని, లోవోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే రైతులతో అధికారులు మర్యాదగా ప్రవర్తించాలని, బిల్లింగ్ లోపాలను సరిదిద్దాలని పేర్కొంటూనే, వినియోగదారులు కూడా విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సెస్ డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.






## జేఈఈ మెయిన్స్-01 ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సిఓఈ విద్యార్థులు

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల బాలురు సిఓఈ బెల్లంపల్లిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గత నెలలో జరిగిన జేఈఈ మెయిన్స్-01 పరిక్ష ఫలితాల్లో 12 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా మెయిన్స్‌కి అర్హత సాధించారని ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్ తెలిపారు. జేఈఈ మెయిన్స్‌కి అర్హత సాధించిన విద్యార్థుల యొక్క వివరాలు గోదారి అంజన్న, రాంటెంకి గిరిధర్, మైలరాపు విశ్వతేజ, దుర్గం అభిరాం, దూలం అశ్విన్, రమటెంకి హవిష్, కొదురుపాక మన్విత్, అవునూరి మనిష్, దుర్గం యశోమార్, కడసి ధనుష్, కొండగుర్ల రాంచరణ్, మదికొండ అవినాష్. వీరిని జోనల్ ఆఫీసర్ గిరిజా, డిసిఓ రమా కళ్యాణి చరవాణి ద్వారా అభినందించారు. అదే విధంగా విద్యార్థులతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ ఆకిడి విద్యాసాగర్, వైస్ ప్రిన్సిపాల్ గోపి, కళాశాల అధ్యాపక బృందం కొండలరావు, దశరథ రామ్, శ్రీరామ వర్మ, రవీందర్, సుధాకర్, సమందర్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

## శివాలయంలో హుండీ లెక్కింపు: రూ. 51 వేల ఆదాయం

**సిరికొండ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు సమర్పించిన కానుకల హుండీ లెక్కింపును బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు శివశంకర్ పర్యవేక్షణలో సభ్యులు, గ్రామ పెద్దలు కలిసి హుండీలోని నగదును లెక్కించగా, మొత్తం 51,000 రూపాయల ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు వెల్లడించారు. శివరాత్రి వేడుకల సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకోవడంతో ఈ స్థాయిలో కానుకలు లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటన్న, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు చిన్న రాజన్న, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి గంగాధర్, గౌరవాధ్యక్షులు లక్ష్మణ్, ప్రచార కార్యదర్శి స్వామి, మాజీ అధ్యక్షుడు మహేష్, గ్రామ పెద్దలు రాజన్న, బత్తుల అశోక్, కమిటీ సభ్యులు గురుమూర్తి, మల్లేష్, సాయిని స్వామి, నరేష్, మధుకర్, సంతోష్, లస్మన్న తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య టెక్నో స్కూల్స్ గ్రాండ్ జోనల్ స్పోర్ట్స్ మీట్

**మందమర్రి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**



మందమర్రి పట్టణంలో సింగరేణి మైదానంలో తెలంగాణ శ్రీ చైతన్య పాఠశాలల జోనల్ క్రీడాపోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ క్రీడా పోటీల్లో మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, లక్సెట్టిపేట, గోదావరిఖని, కాగజ్‌నగర్ జట్టు విద్యార్థులు సుమారు 800 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి మందమర్రి జీఎం రాధాకృష్ణ, డిప్యూటీ జీఎం అశోక్, మండల విద్యాధికారి రమేష్ రాథోడ్ హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమంలో నృత్యాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. జీఎం రాధా కృష్ణ క్రీడా పతాకాన్ని ఎగురవేశారు, అన్ని బృందాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విజేతలను చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య మామ్ అభినందించారు. శ్రీ చైతన్య స్కూల్ డివిజనల్ మేనేజర్ సదాశివరెడ్డి, మంచిర్యాల అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అరవింద్ రెడ్డి, కరీంనగర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం రాజు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# జనహిత సేవలు అభినందనీయం

## బెల్లంపల్లి జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం - బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో బెల్లంపల్లి పట్టణం తాపీ సంఘ భవనంలో తలసేమియా సికిల్ సెల్ వ్యాధి గ్రస్తుల సహాయార్థం మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. మెగా రక్తదాన శిబిరంలో 102 యూనిట్ల రక్తం సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి -రమేష్, వైస్ చైర్మన్ రాగంశెట్టి సతీష్ లు హాజరై రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి-రమేష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి రక్తదానం గొప్పదని రక్తదానం ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుంది అని ఆరోగ్యవంతులు ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని కోరారు. జనహిత సేవా సమితి సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం అని జనహిత సభ్యులని అభినందించారు. జనహిత సేవా సమితి యొక్క సేవా కార్యక్రమాలకి మున్సిపల్ కౌన్సిల్ నుండి ఎల్లవేళలా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణ దానమని రక్త దానం వల్ల ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుందని తలసేమియా, సికిల్ సెల్, డయాలసిస్, అత్యవసర కేసుల్లో పేషెంట్స్ కి ఉపయోగపడతాయని రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న రక్త దాతల కి రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులకు సిబ్బందికి జనహిత సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్, సభ్యులు కాసర్ల శ్రీనివాస్, కౌన్సిలర్లు బండారి స్రవంతి, నిచ్చకోల వంశీ, చంద్రవెల్లి గ్రామ సర్పంచ్ చిలుముల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు దావ రమేష్, శంకర్ సింగ్, పోలు శ్రీనివాస్, గాలి శ్రీనివాస్, దామెర శ్రీనివాస్, పీక లక్ష్మణ్, బీజేపీ నాయకులు పట్టి వెంకటకృష్ణ, గజేల్లి రాజ్ కుమార్ రెడ్ క్రాస్ సిబ్బంది, జనహిత సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మెడికల్ సిబ్బంది, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

# క్యాతన్‌పల్లి ప్రజా చైతన్యం పోరాట పటిమకు నిదర్శనం

**- కంది క్రాంతి**

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా కౌన్సిల్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌లు సిపిఐ పార్టీ, బిఆర్ఎస్ పార్టీ లకు చెందిన మహిళ కౌన్సిలర్లు, కౌన్సిలర్‌ల పై దాడి చేసి ఎన్నిక వాయిదా చేసిన సంఘటనకు నిరసనగా బుధవారం సీపిఐ, బిఆర్ఎస్ పార్టీలు ఉమ్మడిగా బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ప్రజలు, సబ్బండ వర్గాల వ్యాపారస్థులు స్వచ్ఛందంగా బందులో పాల్గొన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి అక్బర్ అలీ, బిఆర్ఎస్ యువ నాయకుడు కంది క్రాంతిలు విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో సిపిఐ, బిఆర్ఎస్ మహిళా కౌన్సిలర్ల పై జరిగిన దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తూ బంద్ పిలుపు ఇవ్వడం జరిగిందని, ప్రజలందరూ బంద్ పాటించి విజయవంతం చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి క్యాతన్ పల్లి మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికను రెండు సార్లు వాయిదా వేయించడం సరికాదని అన్నారు. సిపిఐ, బిఆర్ఎస్ కౌన్సిల్ కు సరిపోయే 14 మంది అభ్యర్థులు ఉన్నా కూడా పోరం లేదని ఒకసారి, కాంగ్రెస్ కౌన్సిలర్ కౌన్సిల్ సమావేశంలో గొడవ చేసి మహిళల కౌన్సిలర్‌ల పై దౌర్జన్యం చేసి గొడవ పేరుతో కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయించడం సరికాదన్నారు. ఇప్పటికైనా సరిపడే సంఖ్య ఉన్నందున బిఆర్ఎస్, సీపీఐ పార్టీల కౌన్సిలర్ సభ్యులను చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకునే విధంగా సహకరించాలని కోరారు.క్యాతన్ పల్లి మున్సిపాలిటీ ప్రజా చైతన్యం పోరాట పటిమకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోడిపెల్లి శైలజ, కాంపెల్లి దేవేంద్ర, సీపిఐ నాయకులు దేవానందం, సంపత్ లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ, సీపిఐ నాయకులు



# రహదారిపై విరిగిపడ్డ చెట్టు..

## తొలగించిన పోలీసులు

**వేమనపల్లి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

మండలంలోని నాగారం అటవీ ప్రాంతంలో భారీ చెట్టు విరిగి రహదారిపై పడటంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సమాచారం తెలుసుకున్న నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తమ సిబ్బందిని పంపించి జెసిబి సాయంతో రోడ్డు పైన ఉన్న చెట్టును తొలగించడంతో వాహనాలకు రవాణా అంతరాయం లేకుండా చేశారు. దీంతో వాహనదారులు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది అభిషేక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

**హాజీపూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి కోర్టు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. నిర్మల్ జిల్లాకు చెందిన ఎండి సద్దాం (25) అనే వ్యక్తి, 15.08.2019న సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో టీఎస్ 01 యూఏ 2932 నంబర్ గల ఆర్టీసీ హైర్ బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి గుడిపేట గ్రామం వద్ద పాత మామిడిపల్లికి చెందిన మేకల అస్మిత (40)ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆమె మరణానికి కారణమైనందుకు గాను (క్రైమ్ నంబర్ 90/2019, సెక్షన్ 304ఏ ఐపీసీ), నిందితుడికి లక్షెట్టిపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కసమల సాయికిరణ్ ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు. ఈ కేసులో అప్పటి విచారణాధికారి ఎస్ఐ బి. చందర్, ఏఎస్ఐ సుధాకర్, ప్రస్తుత ఎస్ఐ డి. కిరణ్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్, కోర్టు లైజనింగ్ అధికారులు వెంకటేశ్వర్లు, గోవిందరావులను ఉన్నతాధికారులు అభినందించారు.

# ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన ఆహ్వానం

**నేరడిగొండ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట గ్రామంలో వెలసిన పోచమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 22న జరగనున్న విగ్రహ ప్రతిష్టాపన, ప్రత్యేక పూజా కార్యక్రమాల వివరాలను ఎమ్మెల్యేకు వివరించి, వేడుకలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా పర్చ సాయన్న ఏకగ్రీవ ఎన్నిక

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**





మండల కేంద్రంలో నిర్వహించిన సర్పంచుల ఫోరం ఎన్నికల్లో మండల ఫోరం అధ్యక్షుడిగా బజార్‌హత్నూర్ సర్పంచ్ పర్చ సాయన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పిప్పిరి సర్పంచ్ ఏళ్ళ కృష్ణకాంత్ రెడ్డిని ఎన్నుకున్నట్లు సభ్యులు ప్రకటించారు. మండలంలోని 31 గ్రామాల సర్పంచులు పాల్గొన్న ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు తోటి సర్పంచులు, నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధికి, సర్పంచుల సమస్యల పరిష్కారానికి తాము నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.



# ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలి

**సిరికొండ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

మండలంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. బుధవారం నిర్వహించిన బూత్ స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో తహసిల్దార్ తుకారాం మాట్లాడుతూ, బిఎల్ఓ తమ పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శించి ఓటర్ల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. జాబితా సవరణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్, వివిధ గ్రామాలకు చెందిన బిఎల్వోలు పాల్గొన్నారు.





ప్రశంస పత్రాలను చూపిస్తున్న విద్యార్థులు



స్టోర్ రూంను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కె. హరిత



హాజరు పట్టికను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కె. హరిత

## జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త

శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రాణించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండేటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక సరస్వతీ శిశుమందిర్లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. న్యూ ఢిల్లీలోని విద్యాభారతి, అచల భారతీయ శిక్షా సంస్థాన్ నిర్వహించిన సాంస్కృతి జ్ఞాన పరీక్షలో శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు గోల్డ్ మెడల్స్ తో పాటు ప్రశంసా పత్రాలను సాధించిన్నట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రభుత్వ ఉపాధ్యాయులు నల్గొండ సత్యనారాయణ, సహార మేనేజర్ కల్లూరి సతీష్ కుమార్, స్థానిక వ్యాపారి అనార్థం శ్రీనివాస్ లు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

# 100 శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలి

**- జిల్లా కలెక్టర్ కె .హరిత**

కెరమెరి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :

పదవ తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయుల కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కే. హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కెరమెరి మండలం మెడి గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల హాజరు పట్టిక, తరగతి గదులు, వంటశాల, సరుకుల నిల్వ గది, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ పసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టిక ఆహారం సకాలంలో అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సంబంధం చేయాలని, ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి సిబ్బంది హాజరు పట్టిక, సరుకుల నిల్వలు, విద్యా బోధన తీరు పరిశీలించారు. ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, వంటశాల, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థినుల ఆరోగ్య పట్ల దృష్టి సారించాలని తెలిపారు. మండలంలోని పల్లె దవాఖానా ను సందర్శించి సార్ ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య, ఆసుపత్రిలో కల్పిస్తున్న సౌకర్యాలు, మందుల నిల్వల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న సామూహిక మరుగుదొడ్ల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల సంఖ్య, సౌకర్యాల వివరాలు తెలుసుకుని పిల్లలకు ఇవ్వవలసిన పోషక ఆహారం క్రమం తప్పకుండా అందించాలని అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యశాల అందించాలని తెలిపారు. అనంతరం మండలంలోని సావర్ ఖేడా గ్రామంలో ఆదర్శ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అధికారులకు పాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎక్సరే పరీక్షల్లో పాల్గొన్న వైద్య బృందం

## టీబీ నిర్మూలనకు ప్రత్యేక స్క్రీనింగ్ శిబిరం

**- 55 మందికి హ్యాండ్ హెల్డ్ ఎక్సరే ద్వారా పరీక్షలు**

పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త

ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెంచికల్ పేట్ పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో ఫిబ్రవరి 17 తేదీ నుండి 21 తేదీ వరకు ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం 55 మందికి హ్యాండ్ హెల్డ్ ఎక్స రే యంత్రం ద్వారా టీబీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించి తగిన పరీక్షలు, చికిత్స కు మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సీతారామ్, మెడికల్ అఫిసార్ డా. ఆర్షిన్, హోమియో డాక్టర్ సతీష్, టెక్నీషియన్ సునీల్, సీహెచ్‌ఓలు అనర్తి, హల్దార్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు నుంచి గుర్తింపు కార్డు కోసం దరఖాస్తులు స్వీకరించాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత

జిల్లాలోని ప్రతి రైతు నుండి గుర్తింపు కార్డు కొసం దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతువేదికలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటితో కలిసి మండల వ్యవసాయ, మండల వ్యవసాయ విస్తరణ శాఖ అధికారులతో రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్, యాప్ ద్వారా యూరియా ఫ్లాట్ బుకింగ్ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు గుర్తింపు రిజిస్ట్రేషన్ కొరకు ప్రతి ఒక్క రైతు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని, ఈ ఐడి ద్వారా ప్రభుత్వ పథకాలు, రాయితీ యంత్రాలు, పెట్టుబడి సాయం, విత్తనాలు, ఎరువులు, ఇతర ప్రయోజనాలు కలుగుతాయని, ఆ దిశగా వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్ పద్ధతి ద్వారా రైతులు ఎరువుల కోసం స్లాట్ బుకింగ్ చేసుకునేలా రైతుకు తెలియజేయాలని అన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం రైతు భూమి వివరాలు, ఆధార్ కార్డు నకల్, మొబైల్ నెంబర్ లు తీసుకోవాలని, రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆయిల్ పామ్, కూరగాయల సాగు వైపు ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు మనోహర్, మిలింద్, వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు పౌష్టికారాన్ని అందించాలి

**- తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్**

తాండూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :



అంగన్వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషక విలువలు పౌష్టికాహారాణి అందించాలని తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు సర్పంచ్ సురేష్, ఉపసర్పంచ్ సత్యనారాయణ అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో పాలు, గుడ్లు, బాలామృతం ఇతరత్రా పోషకాహారాన్ని టీచర్లు అందిస్తారన్నారు. తల్లులు తమ చిన్నారులను సమీపంలోని అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని కోరారు. అంగన్వాడి కేంద్రాల్లోని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ వార్డు సభ్యులను అంగన్వాడి టీచర్లు సన్మానించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూపారాణి, టీచర్లు పావని, అరవింద, సరిత, భారతి, సువర్ణ, లలిత, ప్రేమలత, శకుంతల, స్వప్న, తల్లులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి బీఆర్ఎస్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త



బెల్లంపల్లి పట్టణ మున్సిపల్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ కమిషనర్ సంపత్ సమక్షంలో, నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి, వైస్ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 14 మంది కౌన్సిలర్లు. 1వ వార్డు కొయ్యడ ప్రసన్న, 3వ వార్డు లక్కాకుల సౌజన్య, 4వ వార్డు ఈట కమల, 5వ వార్డు గోగర్ల స్వప్న, 6వ వార్డు సల్ల కృష్ణవేణి, 9వ వార్డు కాంపెల్లి రాజం, 12వ వార్డు తిరుమల వాసు ధరావత్, 13వ వార్డు దొంగల రాజకుమార్, 14వ వార్డు ఆశాది మధు, 18వ వార్డు బత్తుల అనిత, 19వ వార్డు ఎస్.కె. సిమ్రాన్, 20వ వార్డు తాండ్ర స్రవంతి, 21వ వార్డు రాజనాల రమేష్, 31వ వార్డు బండారి స్రవంతి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు తమ తమ వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు నిబద్ధతతో పనిచేస్తామని ప్రమాణం చేశారు. పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధం, తాగునీటి సరఫరా, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :**

భూభారతిలో భూ సంబంధిత సమస్యలపై వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి కలెక్టరేట్ భవన సముదాయంలోని విభాగంలోని సెక్షన్ల పర్యవేక్షకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి పోర్టల్ లో వచ్చిన దరఖాస్తులను తహసిల్దార్ నుండి వచ్చిన ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, తిరస్కరించే ఫైళ్ళకు తగిన కారణాలు వివరంగా నమోదు చేయాలని తెలిపారు. ప్రజావాణిలో వచ్చే వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, కారుణ్య నియామకాల క్రింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నివేదికలు అందించాలని తెలిపారు. చెరువులు, కాలువలు, వివిధ అభివృద్ధి పనుల కొరకు సేకరించే భూములకు త్వరగా పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, కోర్టు కేసులపై దృష్టి సారించాలని తెలిపారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు, ఎయిర్టెల్, బిఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణాలకు ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా భూ కొలతల అధికారి, కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్, పలు విభాగాల పర్యవేక్షకులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న బృందం

## బాలికల ఉన్నత పాఠశాలలో తనిఖీ బృందం పర్యటన

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

జిల్లా విద్యాశాఖ ఆదేశానుసారము లక్షెట్టిపేట మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్నల్ మార్కుల తనిఖీ బృందం పరిశీలన చేశారు. పరిశీలన భాగంగా వారు విద్యార్థుల నోటుబుక్స్, ప్రాజెక్ట్ వర్క్స్, స్లిప్ టెస్ట్ ఆధారంగా వేసే 20 మార్కులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సరైన పద్ధతిలో మార్కులు కేటాయింపు చేసారా అని చూసారు. పరిశీలన తర్వాత మార్కులను 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు స్కూల్ లాగిన్ ద్వారా ఆన్లైన్‌లో అప్లోడ్ చేయవలసిందిగా మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాధికారి జి. శైలజ తెలిపారు. ఈ బృందంలో రంగు సత్యనారాయణ, హెడమాస్టర్ రామన్న, స్లీవయ్య ఉన్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి నగదు అందజేస్తున్న మాజీ జడ్పీటిసి ఎర్ర చంద్రశేఖర్

## మానవత్వం చాటుకున్న మాజీ జడ్పీటిసి ఎర్ర చంద్రశేఖర్

**జన్నారం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

జన్నారం మండలంలోని ఏ గ్రామానికి చెందిన వ్యక్తి ఐన సరే కష్టాల్లో ఉన్నప్పుడు నేనున్నా అంటూ భరోసా కల్పించే గుణం కలిగి ఉన్న మాజీ జడ్పీటిసి ఎర్ర చంద్రశేఖర్ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒక పత్రిక విలేకరి శనిగరపు మహేష్‌కు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి తన మానవత్వం చాటుకున్నారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు.

## నేడు ఘనంగా ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపన: హాజరుకానున్న ప్రముఖులు

**సారంగాపూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. మండల కేంద్రంలో నిర్వహించే ప్రతిష్టాపన మహోత్సవంలో అల్లోల మురళీధర్ రెడ్డి పాల్గొననుండగా, వివిధ గ్రామాలలో జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమాలలో నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలకు మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, శివాజీ స్మారక సమితి సభ్యులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరానున్నారు. విగ్రహ ప్రతిష్టాపనను పురస్కరించుకుని గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది.



## భౌతిక శాస్త్ర ప్రతిభా పరీక్షలో ప్రతిభ కనబరిచిన మురిమడుగు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

**జన్నారం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

మండల స్థాయి భౌతికశాస్త్ర ప్రతిభా పరీక్షలో జన్నారం మండలంలోని మురిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జాదవ్ నవదీప్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదవ తరగతి 9వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన మండల స్థాయి భౌతిక శాస్త్ర ప్రతిభ పరీక్షలో జాదవ్ నవదీప్ ప్రథమ స్థానం సాధించడం ఆనందించదగ్గ విషయమని, విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాలలో తీర్చి దిద్దడమే ముఖ్యంగా మేము, మా ఉపాధ్యాయులము కృషి చేస్తున్నామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గూడూరి పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు జాదవ్ నవదీప్ ను అభినందించారు.



## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక చేయూత

**చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

కలిసి చదువుకుని, మొన్నటి వరకు తమలో ఒకడిగా ఉన్న తమ స్నేహితుడు అనారోగ్యంతో మరణించడంతో ఆ స్నేహబంధం ఆ కుటుంబానికి అండగా నిలిచింది. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన బండారి రాజబాపు అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న రాజాబాపు చిన్ననాటి స్నేహితులు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం 50 కేజీల బియ్యంతో పాటు, రాజబాపు కూతురి పేరు మీద 50,000 రూపాయలు డిపాజిట్ చేసి, డిపాజిట్ బాండు పేపర్‌ను అందించారు.

## అంగన్వాడి కేంద్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించిన గ్రామ సర్పంచ్

**జన్నారం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త**

జన్నారం మండలం చింతగూడెం గ్రామ అంగన్వాడి 1 కేంద్రంలో గ్రామ సర్పంచ్ సుతారి సుమలత పలు కార్యక్రమాలు నిర్వహించారు. మొదటగా ప్రభుత్వం నుండి వచ్చిన యూనిఫామ్ లను పిల్లలకు అందచేశారు, అలాగే గర్భిణీ స్త్రీలకు కోడి గుడ్లు పంపిణీ చేశారు. అనతరం చిన్నారి తాటి శ్రీమత్ పటేల్‌కు అక్షరాభ్యాసం, కస్తూరి వేదాన్షికి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అలాగే అంగన్వాడి కేంద్రం నిర్వహణ, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ తాటి అనిత, ఏఎన్ఎం భూక్యా రాజేశ్వరి, ఆశ కార్యకర్త కందుల స్వరూప పాల్గొన్నారు.



## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

**పెన్షన్ పెంపునకు ప్రభుత్వం సిద్ధం: సాక్ పెల్లి సురేందర్**

**సారంగాపూర్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల హామీల ప్రకారం దివ్యాంగులకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్, స్పందన దివ్యాంగుల జిల్లా ప్రధాన కార్యదర్శి సాక్ పెల్లి సురేందర్ తెలిపారు. బుధవారం నిర్మల్ సోషల్ మీడియా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర వికలాంగుల సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్యను కలిసి దివ్యాంగుల సమస్యలను విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో పాటు దివ్యాంగులకు రూ. 6000 పెన్షన్ పెంపు హామీని కూడా ప్రభుత్వం వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల అభివృద్ధికి కట్టుబడి ఉందని, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఇసాక్ అలీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.



## ఎన్నికల ప్రవర్తన నియమావళి ఎత్తివేత

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిత**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:**

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రవర్తన నియమావాలళిని ఎత్తివేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె.హరిత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండో సాదారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని ఆసిఫాబాద్ కాగజ్ నగర్ మున్సిపాలిటిల ఎన్నికల ప్రక్రియ ఈ నెల 17న ముగిసిన నేపథ్యంలో రాష్ట ఎన్నికల కమిషన్ ఉత్తర్వ్యుల ప్రకారం జిల్లలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎత్తేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పేర్కొన్నారు.